

గుబాళిస్తున్న పూల ధరలు

● వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడులు

● శుభ ముహూర్తాలు, వ్రతాలతో పెరిగిన గిరాకీ

కలికిరి, ఆగస్టు 16: పూల రైతుల పంట పండింది. మార్కెట్లో అన్ని రకాల పూల ధరలు రెండు, మూడింతలు పెరిగాయి. జూలై నెల వరకూ ఓ మోస్తరుగా ఉన్న ధరలు ఆగస్టులో ఒక్కసారిగా పుంజుకున్నాయి. దీంతో ఒకవైపు పూల రైతులు ఆనందంతో ఉండగా మరోవైపు పూల కొనుగోలుదారుల మొహాలు ముడుచుకుపోతున్నాయి. మూడు నెలలుగా శుభకార్యాలు, ముహూర్తాలు కరువై స్తబ్దుగా ఉన్న తెలుగు లోగిళ్లు ఆగస్టు నెలలో ముహూర్తాలన్నీ ఏకబిగిన ముంచుకురావడంతో పూల మార్కెట్‌పై పత్యక్ష ప్రభావం పడింది. గురు, శుక్ర మూఢాలు వరుసగా రావడంతో మూడు నెలలపాటు ముహూర్తాలు లేక తెలుగు లోగిళ్లు బోసిపోయిన విషయం తెలిసింది. ఆగస్టు 5 నుంచి తిరిగి దివ్యమైన ముహూర్తాలు రావడంతో శుభకార్యాలు మొదలయ్యాయి. దీనికి తోడు శ్రావణ శుక్రవారాలు కూడా కలిసి రావడంతో పూల మార్కెట్లు పుంజుకున్నాయి. శ్రావణ మాసం నోములు వ్రతాలకు పేరొందిన విషయం తెలిసిందే. వాతావరణంలో తీవ్రమైన మార్పులు, కొన్ని ప్రాంతాల్లో పడిన భారీవర్షాల కారణంగా కూడా పూలకు డిమాండు పెరగడానికి కారణమైందని చెబుతున్నారు. అయితే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసే పూల హోల్‌సేల్ వ్యాపారులు చెల్లిస్తున్న ధరలకు, బహిరంగ మార్కెట్లో కొనుగోళ్లకు పొంతన లేకుండా ఉందని రైతులకన్నా హోల్‌సేల్ వ్యాపారులు అత్యధికంగా లాభాలు గడిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత నెలలో బంతి పూల ధర కిలోకు రూ.15 నుంచి 20 వరకూ వుండగా ప్రస్తుతం రూ.150 వరకూ అమ్ముతున్నారు. తెల్ల చామంతుల ధర రూ.400 వరకూ చేరుకుంది. పసుపు చామంతులు ధర కూడా అదే దరిదాపుల్లో ఉంది. లిల్లీ పూలు రూ.100 నుంచి 500లకు పెరిగాయి. కనకాంబరాలు అంబరాన్నే తాకుతున్నాయి. కిలో రూ.1500 పైబడుతున్నాయి. రోజాలు మాత్రం రూ.400లకు అటూ ఇటుగా ఉన్నాయి. సన్నజాజులు మరీ నాజూకయిపోయి రూ.1200 వరకూ అమ్ముడవుతున్నాయి. ఒక దశలో కనకాంబరాలు, సన్నజాజులు రూ.2 వేల చేరువకు చేరాయి. మొత్తం మీద అన్ని రకాల పూల ధరల్లో మూడింతల పెరుగుదల కనిపిస్తోందని అంటున్నారు. ఇక ఇప్పుడిప్పుడే ధరలు దిగొచ్చే అవకాశం కూడా లేదంటున్నారు. సెప్టెంబరులో వినాయక చవితి పండుగతో దాదాపు ఆ నెలంతా కూడా పూలకు గిరాకీ స్థిరంగానే ఉంటుందని చెబుతున్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ఒంటిమిట్ట,ఆగస్టు 16: ఒంటిమిట్ట కోదండరామాలయంలో టీటీడీ అర్చకులు, అధికారులు సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి రామాలయంలో మండపం వద్ద ఉంచి పూజలు ప్రారంభించారు. కుంకుమ, లక్ష్మీదేవి ప్రతిమ, జాకెట్ మహిళలకు అందజేసి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో గడపాలని వరలక్ష్మీవ్రతాన్ని చేసినట్లు పూజారులు తెలిపారు. అనంతరం మహిళలందరికీ పసుపు, కుంకుమ, గాజులను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న అర్చకులు

పేదల 'అన్న'పూర్ణ

● మదనపల్లెలో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభం

● ప్రజల నుంచి క్యాంటీన్లకు విశేష స్పందన

● తొలిరోజున 2,100 మందికి అల్పాహారం, భోజనం

మదనపల్లెటౌన్, ఆగస్టు 16: పేదల పాలిట అన్నపూర్ణ అయిన అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది పేదలు, అన్నార్తుల కడుపు నింపిన అన్నక్యాంటీన్లను అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మూసివేసి పేదల కడుపుకొట్టింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీన్లను ప్రారంభించి పేదల కళ్లల్లో ఆనందం నింపింది. రాష్ట్రంలో మొదటి విడతలో 100 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించగా అందులో అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనే రెండు క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డు ఎదుట, వారపుసంత వద్ద రెండు క్యాంటీన్ల వద్ద ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పేదప్రజలు వేచి ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఒక్కో క్యాంటీన్‌లో ఉదయం 350 మందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి 700 మందికి భోజనం వడ్డించారు. రెండు అన్న క్యాంటీన్లలో తొలిరోజున ఒక్కొక్కరి వద్ద పూటకు రూ.5 చొప్పున ధరలతో 2,100 మందికి టిఫిన్, భోజనం వడ్డించారు. కాగా మధ్యాహ్నం అన్న క్యాంటీన్ల వద్ద 1000 మందికి పైగా పేద ప్రజలు క్యూలో నిలబడి టోకెన్లు తీసుకుని అన్నం తిన్నారు. వేడివేడిగా, మంచి రుచులతో వడ్డించిన అన్నం తింటూ కార్మికులు, చిరువ్యాపారులు కళాశాలల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. మదనపల్లె పట్టణంలో 2 లక్షల మంది జనాభా ఉండగా, వాణిజ్య కేంద్రం కావడంతో పాటు, సర్వజన బోధనాస్పత్రి ఉండటంతో బయట ప్రాంతాల నుంచి నిత్యం 5 వేల మందికి పైగా పేద ప్రజలు వచ్చి పోతుంటారు. ఈ క్రమంలో వీరందరికీ అందుబాటులో రెండు అన్న క్యాంటీన్లు సరిపోవని మరొక అన్న క్యాంటీన్‌ను పట్టణంలో ఏర్పాటు చేయాలని పేద ప్రజలు కోరుతున్నారు. కాగా అన్నక్యాంటీన్‌కు స్థానిక విష్ణు జ్యువెల్లర్స్ యజమాని జి.శ్రీనివాసాచారి, జి. కళావతి, వారి కుమారుడు అనిల్‌విష్ణు కలసి రూ.50 వేలు చెక్కును విరాళంగా అందించారు.



మదనపల్లె వారపుసంత అన్న క్యాంటీన్ వద్ద పెద్దసంఖ్యలో క్యూలో నిల్చున్న ప్రజలు

అన్న ఎన్టీఆర్ ఆశయం నెరవేరుతోంది

- షాజహాన్‌బాషా, ఎమ్మెల్యే

పేదలు కడుపు కాలకుండా పట్టెడన్నం ఇవ్వాలని దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయం నెరవేరుతోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వారపుసంత, మార్కెట్ యార్డు వద్ద రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసి పేదల కడుపుకొట్టిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు తిరిగి రాష్ట్రంలో ఒకేసారి 100 అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి వేలాది మందికి తక్కువ ధరలకే భోజన సదుపాయం కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు గాజుల శివరామ్‌ప్రతాప్, ఆర్‌కే రామకృష్ణాచారి మాట్లాడుతూ కేవలం రూ.15కే మూడు పూటలా భోజనం అందించడం సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు వద్ద అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పేదోళ్ల ఆకలి తీర్చడంలో ఆనందం

- అనిల్‌విష్ణు, విష్ణు జ్యువెలర్స్, మదనపల్లె



పేదోళ్ల ఆకలి తీర్చడంలో తమవంతు సహాయం ఇవ్వడం ఆనందంగా ఉంది. నేరుగా అంత మందికి ఇవ్వలేము. అందుకే సీఎం చంద్రబాబు పిలుపు మేరకు తమ వంతు విరాళంగా రూ.50 వేలు అన్న క్యాంటీన్ అకౌంటుకు పంపించాము. ధనవంతులు, సహృదయులు ఈ మంచి కార్యక్రమానికి విరాళాలు ఇస్తే పది కాలాల పాటు ఈ పథకం కొనసాగుతుంది.

ఎన్టీఆర్ అన్నం బాగుంది

- నరసమ్మ, టెంకాయల వ్యాపారి, మదనపల్లె

ఎన్టీఆర్ అన్నం బాగుంది. పొద్దున్నే టెంకాయలను బండిలో వేసుకుని పగలంతా కాయలు అమ్మి బతుకుతున్నాను. ఇంట్లో అన్నం చేసేందుకు టైముండదు. ఇప్పుడు అన్న క్యాంటీన్‌లో మూడు పూటలా 15కే టిఫన్, అన్నం పెడుతున్నారు. మాకు కష్టం తగ్గింది. అన్నం కూడా రుచిగా ఉంది. చంద్రబాబుకు దండాలు స్వామి.

సాంబారు, రసం పెండ్లి భోజనంలా వుంది

- రామచంద్ర, చేనేత కార్మికుడు, మదనపల్లె

నీరుగట్టువారిపల్లెలోని అన్న క్యాంటీన్‌లో సాంబారు, రసం పెండ్లి భోజనంలా ఉంది. దిన్నమూ బయట నుంచి వచ్చి మగ్గం నేస్తాను. మూడు పొద్దులా ఇంటికెళ్లి తిని రావాలంటే టైమ్ వేస్టు. ఇప్పుడు దగ్గర్లోనే అన్న క్యాంటీన్ ఉంది. అది కూడా ఐదు రూపాయలకే టిఫన్, ఐదు రూపాయలకే అన్నం పెడుతున్నారు. ఇది మా మగ్గం నేసేటోళ్లకు ఎంతో సౌకర్యం.

ముసలోళ్లకు ఎంతో సౌకర్యం

- దశరథరామయ్య, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె

ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పెట్టడం ముసలోళ్లకు ఎంతో సౌకర్యం. ఇంట్లో వంట ఆలస్యం అయినా ఆకలికి తట్టుకోలేము. ఇప్పుడు అన్న క్యాంటీన్‌కి టైముకు వెళ్లి భోజనం తినచ్చు. అన్నం, సాంబారు కూడా మంచిగా ఉంది. ఎక్కువ మంది క్యూలో ఉంటున్నారు. మాలాంటి వారికి కొంచెం ముందు ప్రత్యేక క్యూ పెడితే బాగుండు.

సూపర్‌సిక్స్ పథకాల అమలులో మరో అడుగు

● చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలులో మరో అడుగుపడిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం మదనపల్లెలో రెండు అన్న క్యాంటీన్లను పరిశీలించి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా అన్నార్థులకు భోజనం వడ్డించిన ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదప్రజల కడుపు నింపడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం కూడా అమలు చేస్తారన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభం కావడంతో వేలాది మంది పేదలు ఆనందంగా ఉన్నారని, ముఖ్యంగా కార్మికులు, చిరు వ్యాపారులు, బయట ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, భవానీప్రసాద్, దొరస్వామి నాయుడు, నాదెళ్ల అరుణ్‌తేజ్, దేవరింటి శ్రీనివాసులు, మేకల రెడ్డిశేఖర్, పఠాన్‌ఖాదర్‌ఖాన్, మహబూబ్‌ఖాన్, మల్లికార్జున, విజయ్ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో అన్నం వడ్డిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, శ్రీరామ్ చినబాబు

ఉపాధిలో రూ.కోట్లు కొట్టేశారు



● రూ.3 కోట్ల పనులకు కోటికి పైగా స్వాహా

● మృతులు, గల్ఫ్‌లో ఉండేవారు, వ్యాపారులు, విద్యార్థుల పేర బిల్లులు

● ఏపీవో నుంచి అటెండర్ల వరకు అక్రమాలు

పుల్లంపేట, ఆగస్టు 16: ఉపాధి హామీ అక్రమాలకు పుల్లంపేట అడ్డాగా మారింది. వైసీపీ పాలనలో అధికారుల సహకారం, నాయకుల అండదండలతో కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయి. ఉపాధి హామీలో పైస్థాయి అధికారుల నుంచి అటెండర్ వరకు అందినకాడికి దోచుకున్నారు. ఒక్కొక్క పంచాయతీలో ఏడాదికి కోటి రూపాయలకు పైగా ఉపాధి హామీలో అక్రమాలు జరిగాయంటే మండలంలోని 21 పంచాయతీల్లో ఐదేళ్లలో ఎన్ని కోట్లు మెక్కేశారో చెప్పనక్కర్లేదు. అడిగేవాడు లేకపోవడంతో అక్రమార్జనను రోజు రోజుకు పెంచుకుంటూ ఉపాధి హామీ సిబ్బంది కోట్ల రూపాయలకు పడగలెత్తారు. సంపాదించిన సొమ్ముతో వడ్డీ వ్యాపారాలతో పాటు రాజంపేటలో లక్షలు వెచ్చించి ప్లాట్లు తీసుకున్నారని ఆరోపణ. చనిపోయినవారు, గల్ఫ్‌కు వెళ్లిన వారు విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉపాధి కూలీలుగా పనిచేశారని బిల్లులు పెట్టి స్వాహా చేశారు. ఒక పంచాయతీలో రోజుకు 250 మంది కూలీకి వెళితే అదనంగా వెయ్యి మందిని కలిపి బిల్లులు నొక్కేశారు. మస్టర్లలో పనిచేసినట్లు రాసినందుకు నాకింత.. నీకింత అన్నట్లు ఉపాధి సిబ్బంది జాబ్‌కార్డు లబ్ధిదారులతో చేతులు తడిపి కోట్లు మింగేశారు. నెలన్నర క్రితం టీడీపీ నాయకులు ఉపాధి హామీలో అక్రమాలు జరిగాయని విచారణ చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని నాయకులు చెబుతున్నారు. పుల్లంపేట మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో వత్తలూరు, పుల్లంపేట, అనంతయ్యగారిపల్లె, జాగువారిపల్లె, కొత్తపేట, టి.కమ్మపల్లె తదితర పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో కోట్లాది రూపాయలు అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఈ పంచాయతీల్లో ఏడాదికి కోటి రూపాయలకు పైగా పనులు జరిగాయి. 40 పంచాయతీల్లో పనికి వెళ్లకపోయినా ఇష్టానుసారంగా మస్టర్లలో పేర్లు రాసి లక్షల రూపాయలు దోచుకున్నారు. కింది స్థాయిలో మేట్ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఈసీ, ఏపీవో వరకు అందరూ మూకుమ్మడిగా కలిసి ఉపాధిలో దోపిడీకి పాల్పడ్డారు. కూలీలకు ఉపాధి చూపించాల్సిన ఉపాధి హామీ పథకం సిబ్బందికి బాగా ఉపాధి చూపించింది. వత్తలూరు పంచాయతీలో 1792 జాబ్ కార్డులు ఉన్నాయి. కూలీలు అయితే మూడు వేలకు పైగా ఉన్నారు. ఇక్కడ మాత్రం పనికి వచ్చేది సుమారు 250 మంది ఉంటారు. ఈ పంచాయతీలో కాలువ పనులు, గుట్టల మీద గుంతలు పనులు చేశారు. రోజుకు 1200 మంది కూలీలు పని చేసినట్లు మస్టర్లలో చూపారు. రోజుకు వెయ్యి మందికి పైగా డబ్బులు నొక్కేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పంచాయతీలోనే గత యేడాది మూడున్నరకోట్లకు పైగా పనులు చేపట్టినట్లు బిల్లు ఇచ్చేశారు. అంతా చూస్తే ఇందులో సుమారు రెండు కోట్ల వరకు ఉపాధి సిబ్బంది జేబుల్లోకి వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. పనిచేయకున్నా వచ్చినట్లు చూపి బిల్లులు చేసి వారానికి 2 వేలు బిల్లు పెడితే జాబ్ కార్డుదారునికి 600 లెక్కన ఇచ్చి మిగతాది నొక్కేసి పంపకాలు చేసుకున్నారు. వత్తలూరు పంచాయతీలో మేట్‌లుగా పనిచేసే ఇద్దరు డబ్బులు వసూలు చేసి పంపకాలు జరిపినట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. వీరు ఉపాధి హామీలో చేరినప్పటి నుంచి ఉపాధిలో అక్రమాలకు పాల్పడి వడ్డీ వ్యాపారాలు, ప్లాట్ల బిజినెస్ చేయడం మొదలు పెట్టారని స్థానికులు చెబుతున్నారు. వత్తలూరుకు చెందిన మండెం శంకరయ్య రెండేళ్ల క్రితం కువైత్‌కు వెళ్లాడు. లేపాకువారిపల్లెకు చెందిన దామర్ల ఆనంద్‌కుమార్ జీవనోపాధి కోసం కువైత్ వెళ్లాడు. కానీ వీరిద్దరూ పనిచేసినట్లు వీరి పేర్లతో బిల్లులు పెట్టి పంచుకున్నారు. 200 పనిదినాలు చూపించి నొక్కేశారు. సుమరు 30 మందికి పైగా కువైత్‌కి వెళ్లినవారి పేర్లతో ఉపాధి పనులు చూపించి నొక్కేశారు. మూరముట్లపల్లికి చెందిన దుగ్గి మల్లికార్జున, మినుగోలు వెంకటసుబ్బయ్య మృతి చెందిన వాళ్లు కూడా వచ్చి పనిచేసినట్లు గత ఏడాది బిల్లు చేసుకుని తినేశారని తెలుస్తోంది. ఇలా చనిపోయిన వారి పేరుతో, గల్ఫ్‌కు వెళ్లిన, ఉద్యోగం చేస్తున్న, ఖాళీగా ఉన్న వారి పేర్లతో జాబ్‌కార్డులు చేయించి పనులకు రాకపోయినా వచ్చినట్లు చూపి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. పుల్లంపేటలో అక్రమాలపై అనేక ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్తపేట పంచాయతీలో అయితే లక్షల రూపాయల్లో జీతం తీసుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వచ్చి ఇక్కడ పని చేసినట్లు వైసీపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి పేర్లు రాసి మెక్కేశారు. అలాగే టి.కమ్మపల్లె పంచాయతీలో కూడా ఒకరికి ముగ్గురు వచ్చినట్లు చూపి ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడి లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులకు గండికొట్టారు. అనంతయ్యగారిపల్లెకు అయితే మండలస్థాయి వైసీపీ నాయకుడు తమ కనుసన్నల్లో ఉపాధి పనులు చేయించి వాటాలు పంచారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా మండలంలో ఐదేళ్లలో కోట్ల రూపాయల్లో అవినీతి జరిగిందని కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ముందుగానే వాటాలు మాట్లాడుకుని ఉపాధి పనుల్లో కోట్ల రూపాయలు దండుకున్నారని తెలుస్తోంది. ఉన్నతాధికారులు విచారణ చేపడితే ఎన్ని కోట్ల రూపాయలు మింగేశారు, ఎవరెవరు అక్రమాలకు పాల్పడ్డారో ఇట్టే తెలిసిపోతుంది. మరి కూలీలకు చేతులు తడిపి ఉన్నదంతా మెక్కేసిన ఉపాధి సిబ్బంది అధికారులపై విచారణ చేసి నిజానిజాలు వెలికి తీయాలని స్థానికులు, అధికార పార్టీ నాయకులు కోరుతున్నారు.

ఉపాధిలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

- శ్రీనివాసులు, ఏపీవో, పుల్లంపేట

పుల్లంపేట మండలంలో ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదు. పార్టీల పరంగా ఫిర్యాదులు రావడం మామూలే. ఉపాధి పనులకు సంబంధించి కూలీల అకౌంట్‌లోనే నేరుగా డబ్బులు పడతాయి. కూలీలను మేనేజ్ చేసుకుని ఎవరో ఒకరిద్దరు కక్కుర్తిపడి ఉండవచ్చు. అంతే గాని ఎలాంటి అక్రమాలు జరగలేదు.



పుల్లంపేటలోని ఉపాధి హామీ కార్యాలయం

గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి రోడ్డెక్కిస్తా...

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప(మారుతీనగర్), ఆగస్టు 16: గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి రోడ్డెక్కించి సరైన దిశలో ముందుకు సాగేలా చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కడప ఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో గల ఆర్టీసీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆర్టీసీ అవినీతి ఊబిలో కూరుకుపోయిందని... నిష్పక్షపాతంగా విచారణ జరిపించి ఆర్టీసీని కొత్త పుంతలు తొక్కిస్తామన్నారు. కొత్త బస్సులు తెచ్చే విషయంలో ఫైనల్ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. పక్క రాష్ట్రాలతో మన ఆర్టీసీని బేరీజు వేసుకోవడం సరైంది కాదన్నారు. పక్కరాష్ట్రాల్లో ఆర్టీసీ కార్పొరేషన్ స్థాయిలో నడుస్తుందనే సంగతి గుర్తెరగాలన్నారు. అదే మన రాష్ట్రంలో ఆర్టీసీ గవర్నమెంటు పరిధిలో నడుస్తుందని.. జీతభత్యాలు కూడా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఆర్టీసీలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు వీలుగా ఫిట్‌మెంటు లేని బస్సులను పూర్తిగా నిలుపుదల చేస్తామని తెలిపారు. గవర్నమెంటు, టూరిస్టు, స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌ను నిశితంగా పరిశీలించేలా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

వంకపోరంబోకు స్థలంలో అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకువచ్చే గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్ ఫొటో)



ఆ స్టేషన్‌లో అంతా ఏకపక్షమే...

- సివిల్ పంచాయితీలే లక్ష్యం
- వైసీపీ పాలనలో అసాంఘిక కార్యక్రమాలకు వత్తాసు
- దందాల అడ్డాగా మారిన రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్
- కార్లు, భవనాలు కొనుగోలు వేసిన వైనం

రైల్వేకోడూరు, ఆగస్టు 16: ఏక పక్షమై పోలీసుల పర్వంలో సివిల్ పంచాయితీలే లక్ష్యంగా, అసాంఘిక కార్యకలాపాలకు వత్తాసు పలుకుతూ రైల్వేకోడూరు పోలీసు స్టేషన్‌ను దందాల స్టేషన్‌గా మార్చారు అధికారులు. విలాసవంతమైన జీవితం అనుభవించేందుకు ఇదొక మార్గంగా ఎంచుకోవడం చూస్తే ఔరా అనిపిస్తోంది. వైసీపీ పాలనలో పోలీసులు ఏకపక్షంగా పంచాయతీలు చేసి వచ్చిన డబ్బుతో కొత్త కార్లు, భవనాలు కొనుగోలు చేశారని విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అసాంఘిక కార్యక్రమాలకు పోలీసుల సహకారం అంతాఇంతా కాదు. గంజాయి, పేకాట, మట్కా, ఎర్రచందనం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలు అడ్డూఅదుపు లేకుండా జోరుగా సాగాయి. ఐదేళ్ల రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో దందాలు అత్యధికంగా సాగాయి. చిన్న కార్యకర్త మొదలు పెద్ద నేత వరకు చెప్పిన పనులు ఏకపక్షంగా చేసి బాధితుల నుంచి ఇరు వైపులా డబ్బు తీసుకున్న సందర్భాలూ ఉన్నాయనే అపవాదు ఉంది. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై రావాలంటే గతంలో ఎవరూ వచ్చే వారు కాదు. అయితే రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎక్కువగా పంచాయితీలే జరుగుతాయనేది ప్రతీతి. దీంతో మొదట చిత్తూరు జిల్లా పోలీసులే ఎక్కువగా రైల్వేకోడూరుకు వచ్చేవారు. కాని అది కాస్త తగ్గి కర్నూలు వైపు మళ్లింది. ప్రస్తుతం కర్నూలు జిల్లా పోలీసులే ఎక్కువగా ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. క్రమేణా పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు పుంజుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు ఎక్కువయ్యాయి. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు వైసీపీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలిచారు. వైసీపీ నుంచి ఫోన్ కాల్ వచ్చిందంటే చాలు న్యాయమైన వారికి బెదిరింపులు వస్తాయి. సివిల్ పంచాయితీలు అంటూ బయటే మాట్లాడుకోవాలనడం, బాధితులను కేసుల్లో ఇరికిస్తామని బెదిరించి ఇద్దరి వద్ద పైసలు లాక్కునే వారు. ఈ తంతు ఐదేళ్ల పాటు నిర్విరామంగా జరిగింది. డబ్బు సంపాదించిన పోలీసులు కార్లు, భవనాలు తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో అసలైన బాధితులకు న్యాయం జరగలేదు. అంతకాకుండా గంజాయి అమ్మకాలు విపరీతంగా జరిగాయి. అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. నామమాత్రంగా ఆరుగురిపై కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారు. అత్యంత విలువైన, అరుదైన ఎర్రచందనం అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర కీలకంగా ఉన్నాయని ఆరోపణలు వినిపించాయి. వైసీపీ నేతలు, వారి సోదరులు, ద్వితీయ శ్రేణి నేతలు పెద్దఎత్తున పేకాట నడిపించారు. పేకాటలో చాలా మంది డబ్బు పోగొట్టుకుని బికార్లు అయ్యాయి. మట్కా ఆడేవాళ్లకు వైసీపీ వత్తిడితో పోలీసులు మామూళ్లు తీసుకున్నారని ఆరోపణలు వినిపించాయి. ఐదేళ్లలో గంజాయి, పేకాట, ఎర్రచందనం, మట్కా తదితర అసాంఘిక కేసులు నామమాత్రంగా నమోదయ్యాయే తప్ప నిజంగా అసాంఘిక కార్యక్రమాలు ఎవరు చేస్తున్నారు, ఎలా వస్తున్నాయి, ఎవరి ప్రమేయం ఉంది అనేది లోతుగా విచారణ చేసిన దాఖలాలు లేవు. ఐదేళ్లలో పోలీసులు వైసీపీకి తొత్తులుగా పని చేశారే తప్ప ప్రజా వినతులు చూసి న్యాయం చేయలేదు. ఇక పోతే భూ పంచాయతీల్లో తలదూర్చి డబ్బు గుంజుడు. సివిల్ పంచాయితీలు చేయకూడదని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం లేకపోయింది. పంచాయితీలు చేసి డబ్బు సంపాదించుకోవాలన్న తపనలోనే నిమగ్నమైపోయారు. వైసీపీ కార్యకర్తలు, నేతలు రేబాన్ అద్దాలు, చేతులకు కడియాలు, మంచి సెంటు వాసనతో వచ్చి కూర్చుని పోలీస్‌స్టేషన్‌లో దందాలు చేశారు. ఐదేళ్లలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలు, రైతులు, వ్యాపారులు తదితర రంగాల వారు న్యాయం జరగక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు నామమాత్రంగా చేసి ఇరు వర్గాలను బయటి ప్రాంతాలకు పిలిపించుకుని ముక్కుపిండి వసూలు చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇదిలా ఉండగా గత మండల పరిషత్ ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. దీంతో పోలీసులపై నమ్మకాలు ప్రజలకు సన్నగిల్లాయి. రాజంపేట డీఎస్పీని వైసీపీ నేత ఒకరు బూతుపురాణం చేశారు. టీడీపీ తరఫున వేసిన నామినేషన్లను వెనక్కితీసుకునేలా పోలీసులు ప్రత్యేక పాత్ర పోషించారు. మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యం జరుగుతున్నా పోలీసులు వైసీపీ కే అండగా నిలిచారు. పంచాయతీ ఎన్నికలు కూడా పోలీసుల కనుసన్నల్లోనే జరిగాయి. ఏకపక్షంగా ఎన్నికలు జరిగేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నించారు. వైసీపీకి కొమ్ముకాసి పంచాయితీ ఎన్నికల్లో రిగ్గింగుకు అవకాశాలు కల్పించారని టీడీపీ దుమ్మెత్తిపోసినా పోలీసు వ్యవస్థ పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో కొందరు పోలీసు అధికారులు కోట్లు సంపాదించుకున్నారని బహిరంగంగా చర్చించుకున్నారు. రైల్వేకోడూరులో ఇదేంది అన్ని ప్రశ్నించిన జర్నలిస్టులను కూడా బెదిరించారు. మైసూరివారిపల్లె పంచాయతీలో వంక పోరంబోకు స్థలంలో అక్రమంగా కట్టడాలు జరుగుతున్నాయని గ్రామస్తులు అడ్డుకున్నందుకు వారిపై కేసులు నమోదు చేయడానికి సైతం వెనకాడలేదు. కోర్టు ఆర్డర్లు ఉన్నా పోలీసులు అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించి దగ్గరుండి కట్టించారు. ఏకపక్ష నిర్ణయాలు, పంచాయితీలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు వ్యవస్థను భ్రష్టుపట్టించారనే విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ, జనసేన తదితర నేతలను అక్రమ అరెస్టులు చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రైల్వేకోడూరులో టీడీపీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న 13 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ వైసీపీ సానుభూతి కలిగిన పోలీసులు స్వామి భక్తిని ప్రదర్శించడం, ఇంకా పాత పద్ధతులను అవలంభించడం, కూటమి అధికారంలోకి వచ్చినా వైసీపీని మరిచిపోక చాటుమాటుగా జరుతుండడం కొసమెరుపు.





రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్ - టీడీపీ నేత అక్రమ అరెస్టును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్ ఫొటోలు)

దందాలు జరగడం లేదు

గతంలో దందాలు జరిగాయో లేదో తెలియదు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌లో దందాలు అసలు జరగడం లేదు. ప్రజల పిర్యాదులు స్వీకరించి న్యాయం చేస్తున్నాము. న్యాయపరంగా ఉన్నవి కేసులు నమోదు చేస్తున్నాము. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు చట్టపరమైన సలహాలు ఇస్తున్నాము. మట్కా, ఎర్రచందనం, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాము.

టి. బాబు, సీఐ రైల్వేకోడూరు

కొవిడ్ సేవలతో అరుణకు అరుదైన గౌరవం

- ఉత్తమ ఏఎన్‌ఎంగా అరుణకుమారికి అవార్డు
- విశేష సేవలకు గవర్నర్ నివాసంలో ఆతిథ్యం

గాలివీడు, ఆగస్టు16: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఏఎన్‌ఎంగా అవార్డు అందుకున్న అరుణకుమారికి అరుదైన గౌరవం దక్కింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నూలివీడు పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి కొవిడ్ సమయంలో అందించిన విశేష్ట సేవలను గుర్తించి స్వాతంత్ర దినోత్సవాల్లో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్‌నజీర్ ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. రాజ్ భవన్ అధికారుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విశిష్ట అతిథులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌తో కలిసి ఆమె పాల్గొనడం విశేషం. తోటి ఉద్యోగులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గవర్నర్‌తో కలిసిన అరుణకుమారి తదితరులు

స్వాతంత్ర్య వేడుకల్లో నూలివీడు విద్యార్థులు

- డీజీపీ నుంచి భవిత, నసీబ్‌కు ప్రశంసా పత్రాలు

గాలివీడు, ఆగస్టు16: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో నూలివీడు హైస్కూల్ విద్యార్థినులు భవిత, నసీబ్ అత్యంత ప్రతిభ కనపరిచారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన మార్చ్ ఫాస్ట్‌లో స్కౌట్ అండ్ గౌడ్స్‌గా వీరు 15 రోజుల శిక్షణానంతరం రాయలసీమ జోన్ నుంచి స్టేడియంలో జరిగిన మార్చ్ ఫాస్ట్‌కు రాష్ట్ర స్థాయి భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ యూనిట్ కమాండర్‌గా ఎంపికై ప్రతిభ కనపర్చి డీజీపీ నుంచి పశంసా పత్రాలను అందుకున్నట్లు పాఠశాల స్కౌట్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాల 40 ఏళ్ల చరిత్రలో రాష్ట్ర స్థాయిలో ఇంత ఘనతను సాధించిన విద్యార్థులను, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్‌ను ఎస్ఎంసీ చైర్మన్ వేల్పుల జనార్ధన్, హెడ్మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



20న 5కే మారథాన్, క్విజ్ పోటీలు

డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్) ఆగస్టు16: ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో 5కే మారథాన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీ, ఎస్టీఐపై అవగాహనలో భాగంగా ఈనెల 20న ఉదయం 5-30 గంటలకు నిర్వహిస్తారన్నారు. క్విజ్ పోటీల్లో 13-25 ఏళ్లలోపు యువత మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో గెలిచిన మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జండర్స్‌కు వేర్వేరుగా మొదటి బహుమతిగా రూ. 7 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు ఇస్తారన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు. తృతీయ బహుమతి రూ. 3 వేలు ఇస్తారన్నారు. ఈపోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఎన్ఎస్ఎస్ అధికారుల ద్వారా గూగుల్ లింక్ ద్వారా తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు అలీహైదర్ 9177103195, శ్రీనివాసరాజు 9032888638 లేదా జిల్లా సూపర్ వైజరు ప్రసాద్ 9959550368ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ రవిబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటరామిరెడ్డి, జిల్లా క్రీడా శాఖాధికారి జగన్నాథరెడ్డి, జిల్లా యువ కేంద్రం అధికారి మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు16: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామాపురం మండలం కల్పనాయుని చెరువు, మంగళంపల్లె చెరువు నుంచి మూడు ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేలు అపరాధ రుసుము వేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ నాగరాజు, ఈహెచ్‌సీ మోహన్‌రెడ్డి, జగదీశ్వర, నాగేంద్ర, జ్యోతి పాల్గొన్నారు



సీజ్ చేసిన ఇసుక టాక్టర్లు

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

రాజంపేట టౌన్, ఆగస్టు 16: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నట్లు రాజంపేట మన్నూరు సీఐ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రీచ్‌లను గుర్తించలేదని తెలిపారు. ఇసుకను రవాణా చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం రీచ్‌లను కేటాయించేంతవరకు సంయమనం పాటించాలని కోరారు.

భారీగా గండికి చేరిన భక్తులు

చక్రాయపేట, ఆగస్టు 16: శ్రావణ మాసోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మొదటి శనివారం ఎప్పుడూ లేనివిధంగా భక్తులు తరలివచ్చారు. ఇక రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. దీంతో చాలా మంది భక్తులు శుక్రవారం రాత్రికే గండి క్షేత్రం చేరుకున్నారు. వివరాల్లోకెళితే....

శ్రావణమాసోత్సవాల్లో భాగంగా రెండో శ్రావణ శనివారం భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఏర్పాట్లు పూర్తిచేశారు. పందిళ్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. రెండో శ్రావణ శనివారం పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రమే భక్తులు గండికి చేరుకున్నారు. వరుస సెలవులు కావడంతో భారీగా రానున్నారు. క్యూలైన్లు, ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ గర్భాలయాన్ని పూలతో అలంకరించి మూలవిరాట్టను తోమాలలతో అలంకరించనున్నారు. రెండోవారం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు. గండికి వచ్చిన భక్తులకు కాలక్షేప కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏదేమైనా రెండో శ్రావణ శనివారం కూడా గండికి భారీగా చేరుకుని అంజన్నను దర్శించుకోనున్నారు.



శుక్రవారం రాత్రి గండికి చేరుకున్న భక్తులు

నిఘా పర్యవేక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

రాయచోటి (కలెక్టరేట్)ఆగస్టు 16: అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, 1989 అమలుకు జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కాకుండా వుండవలెనని, షెడ్యూల్, షెడ్యూలు తెగల అభ్యున్నతి కోసం సామాజిక సేవ దృక్పథం కలిగిన వారై వుండాలి. ఒకరు రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికయ్యేందుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, పౌరహక్కులు, అత్యాచార చట్టాలపైనా అవగాహన కలిగివుండాలి. ఇదివరకు సాఘిక సేవా కార్యక్రమాలు చేసి వుండాలి. తగిన అధారాలతో రెండు ఫొటోలు, కులధృవీకరణ పత్రం, బయోడేటాతో జతపరచి జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిక అధికారి, అన్నమయ్య జిల్లా వారికి 23.8.2024 తేదీ లోపు సమర్పించవలెనని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రమాదంలో యువకునికి గాయాలు

పెండ్లిమర్రి, ఆగస్టు 16: శుక్రవారం ఉదయం కొత్తూరు వద్ద జరిగిన ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కడప నుంచి వేంపల్లెకు కారులో వస్తుండగా శుక్రవారం ఉదయం కొత్తూరు సమీపాన కారు ముందు టైరుపగిలి పల్టీలు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు

రాయచోటిటౌన్, ఆగస్టు16: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబరు మొదటి వారం నుంచి కొత్త సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ పేర్కొన్నారు. ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కోర్సుల్లో చేరేందుకు ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు అర్హులన్నారు. 45రోజులు ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్స్ జారీ చేయబడతాయన్నారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్న ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) పీఎల్‌సీ (ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్) కోర్సుల్లో చేరదలచిన వారు రూ.1500 ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలన్నారు. మరిన్ని వివరాలకు బుచ్చిబాబు సెల్:898512652, లక్ష్మీనారాయణ 7995279315 నెంబర్లను సంప్రదించాలన్నారు.

భార్య కనిపించలేదంటూ భర్త ఫిర్యాదు



రామాపురం, ఆగస్టు16: పాత రామాపురం వాసి వివాహిత కొరివి జయశ్రీ కనిపించలేదని ఆమె భర్త కొరివి గంగాధర ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత రామాపురానికి చెందిన జయశ్రీకి చిన్నకుమార్తె ఉంది. ఆమె బుధవారం ఉదయం బంగారు కొనుగోలు చేయడానికి ఇంటి నుంచి రాయచోటికి వెళ్లిందని, సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో బంధువులకు ఫోన్ చేయగా తన భార్య ఎక్కడ ఉన్నది సమాచారం తెలియకపోవడంతో గురువారం రాత్రి పొద్దుపోయాక రామాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులపై పిచ్చి కుక్క దాడి

అట్లూరు, ఆగస్టు 16: గ్రామంలో పిచ్చికుక్క దాడి చేసి 25 పశువుల మూతిపై దాడి చేసి కరిచింది. వెంటనే వైద్య సిబ్బంది పశువులకు చికిత్స చేశారని పశువుల యజమానులు తెలిపారు. మనుషులపై దాడి చేయకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పొలతల క్షేత్రంలో వైభవంగా వరలక్ష్మీవ్రతం





వరలక్ష్మి వ్రతానికి హాజరైన మహిళలు - ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

పెండ్లిమర్రి, ఆగస్టు 16: శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం పొలతలలో వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. పొలతల పార్వతి సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతానికి హాజరైన ముత్తైదువులకు వాయనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెయ్యినూతల కోనలో...

ప్రముఖ వైష్ణవ క్షేత్రం వెయ్యినూతలకోన లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

ముద్దనూరు ఆగస్టు16: మారెమ్మ కుంట సమీపంలో గొర్రెల మందపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో 6 గొర్రెలు మృతి చెందగా ఒక గొర్రెకు తీవ్రగాయమైంది. గొర్రెల కాపరి రాచకుంట సూరి సమాచారం మేరకు మారెమ్మ కుంట సమీప గొర్రెల షెడ్డు పైకి కుక్కలు దాడి చేశాయి. షెడ్డులో నున్న గొర్రెల మందలోని 6గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక గొర్రెకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. నష్టపరిహారం అందేలా అధికారులు న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



గొర్రెల కళేబరాలు

గండికోట నీటిమట్టం 6.5 టీఎంసీలు



గండికోట ప్రాజెక్టులోకి వస్తున్న కృష్ణాజలాలు

కొండాపురం, ఆగస్టు 16: గండికోట ప్రాజెక్టులో శుక్రవారం సాయింత్రానికి 6.5 నీటిమట్టం డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,700 క్యూసెక్కులున్నట్లు డీఈ తెలిపారు. గండికోటలో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. 11న అవుకు రిజర్వాయిర్ నుంచి నీటిని విడుదల చేయగా ఇప్పటివరకు 4.5 టీఎంసీలకు పైగా నీరు గండికోటకు చేరింది.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం


వీరభద్రాలయంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న వేదపండితులు

రాయచోటిటౌన్, ఆగస్టు16: శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రుడి విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నాలుగు కాళ్ల మండపం వద్ద వరలక్ష్మిదేవి వ్రతం నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పసుపు, కుంకుమ, సూత్రంతో పాటు ప్రసాదాలను పిన్నం సరోజమ్మ, శైలజ, వర్షిణిశ్రీ రాయల్, వరున్ అభివర్ధన్‌రాయల్ కుటుంబ సభ్యులు అందజేశారు. రాజశేఖర్, విజయకుమారి, అఖిల్, విష్ణు, వర్షిణి, స్వాయికీర్తి అన్నదానం చేశారు. రెడ్డీస్‌కాలనీలో ఉన్న రామాంజనేయస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.సంగీత రైస్ మిల్ యజమాని వెంట్రామరాజు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

లక్కిరెడ్డిపల్లె: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలో గంగమ్మ, సర్వమంగళదేవి, రామలింగేశ్వరస్వామి, లక్ష్మివెంకటేశ్వర ఆలయాల్లో పూజలు చేశారు.

గాలివీడు: స్థానిక బ్రాహ్మణ వీధి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేశారు. అర్చకుడు ఆనంద్ ఆచార్యులు వ్రత క్రతువు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సిద్దవటం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా బంగారుపేటలోని గంగాభవాని అమ్మవారి ఆలయం, పార్వతీపురం, మూలపల్లె క్రాస్ వద్ద వెలసిన శీతల గంగమ్మ అమ్మవార్లను పసుపు కుంకుమతో అలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లోని అర్చకులు, మహిళలకు తీర్థ ప్రసాదాలు అందించారు.

చిట్వేలి: కొత్తబస్టాండులోని సత్యమ్మ ఆలయంలో పంచామృతాభిషేకం, కుంకుమ, చందన అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో రాహుకాల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక శివాలయంలో అర్చకులు పవన్‌శర్మ శ్యామలాంబకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాత చిట్వేలిలో భద్రకాళి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించి, అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మండలంలో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు.

రామాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. కలశం గౌరీ దేవిని ఏర్పాటు చేసుకొని పూజలు చేశారు.

నందలూరు: మండలంలోని మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎవరి ఇళ్లల్లో వారు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. నాగిరెడ్డిపల్లె లోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో రాత్రి వ్రతం నిర్వహించారు.

పెనగలూరు: మండలంలోని మహిళలు గృహాల్లో, దేవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఇళ్లలో అమ్మవార్లకు పూజలు చేసి ఇరుగు పొరుగువారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుండుపల్లె: పెద్దబలిజపల్లె, మల్లక్కగారిపల్లె రహదారిలో ఉన్న సిద్దేశ్వర స్వామి, కూటాలమ్మ దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అభిషేకం, అర్చనలు చేశారు. పూజకు వచ్చి న భక్తులందరికీ గ్రామ ప్రజల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

రాజంపేట టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిని ప్రత్యేకంగా అలకరించారు. చౌడేశ్వరి, మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ, కామాక్షమ్మ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నారు. పలురకాల పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. మహిళలు బంధు మిత్రులను ఇంటికి పిలించుకుని తాంబూళాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

కబ్జాదారుల బరితెగింపు..

● బస్సు షెల్టర్ ఆక్రమణ


చదును చేసిన వంక పోరంబోకు స్థలం

వీరబల్లి, ఆగస్టు 16: మండల పరిధిలోని ఓదివీడు గ్రామం కావలిపల్లెలో కబ్జాదారులు రెచ్చిపోయారు. గతంలో వంక పోరంబోకు స్థలంలో ప్రజల సౌకర్యార్థం అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బస్సు షెల్టర్‌ను నిర్మించాడు. ప్రస్తుతం ఆ గ్రామానికి చెందిన కొందరు ఆ బస్సు షెల్టర్‌ను ధ్వంసం చేసి పక్కనే ఉన్న వంక పోరంబోకు స్థలాన్ని కూడా ఆక్రమించారు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఇందుకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న బస్సు షెల్టర్‌ను తొలగించడమే కాకుండా దాని వెనుక ఉన్న స్థలాలను చదును చేసి దర్జాగా నిర్మాణాలకు సిద్ధమవుతున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో శ్రీరాములును వివరణ కోరగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటో డ్రైవర్లందరూ లైసెన్సు కలిగి ఉండాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు, ఆగస్టు 16: ప్రతి ఆటో డ్రైవర్ తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ఆయన శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపరాదని, ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలన్నారు. మీ ఆటోల్లో అనుమానాస్పద వ్యక్తులు ఎక్కినప్పుడు వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఆటోకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఆటోలకు శక్తికి మించి ఓవర్ లోడ్‌తో వెళ్లకూడదని హెచ్చరించారు.

మహిళలపై వేధింపులు అరికట్టాలి


నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

రామాపురం, ఆగస్టు 16: దేశ వ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్, మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు, కార్యదర్శి నంద్యాల సరోజమ్మ, మర్రి సుమిత్రమ్మ డిమాండ్ చేశారు. రామాపురంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కార్యదర్శుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చిన భేటీ పడావో, బేటీ బచావో నినాదంగానే మిగిలింది తప్ప, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మొన్న నంద్యాలలో సంఘటన మరువక ముందే, విజయనగరం జిల్లాలో పసికందుపై అఘాయిత్యానికి ఒడికట్టిన నరరూప రాక్షసుడిని నడిరోడ్డుపై ఉరితీయాలని, లేకపోతే జీవితమంతా కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇంకా కఠినతరమైన చట్టాలుచేసి, వాటిని కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్బమ్మ, మల్లిక, కుమారి, గంగోజమ్మ, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దుతాం: ముక్కా


రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా స్థాయిలో ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దుతామని రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ఇటీవల 12 లక్షల రూపాయ లతో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు ను ప్రారంభించారు. ముందుగా ప్రిన్సిపాల్ హరిత ,పీడీ శారద, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ప్రారంభోత్సవం అనంతరం కళాశాలలో వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ కార్యాలయంలో స్థానిక నాయకులు, సిబ్బందితో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాము పార్టీ మారామన్నారు. కళాశాలలో అదనపు గదులు కోసం అభ్యర్థించగా మీరు కోరిన దాని కన్నా ఎక్కువగా చేస్తామని, జిల్లాస్థాయిలో గుర్తింపు కలిగేలా చేస్తామని, మెరుగైన వసతులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఉత్తమ బోధనా సిబ్బందితో పాటు అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ కళాశాలను వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ అధి కారి చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌రావు, స్థానిక సర్పంచ్ కుమారుడు గద్దె పెంచలయ్య, జడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, సీనియర్ నాయ కులు నాగా శివశంకర్‌రెడ్డి, పి.వాసుదేవరెడ్డి, కల్లా చలపతి, నాగేంద్ర నాయుడు, మాజీ మార్కెట్ డైరెక్టర్ కమతం నాగరాజు, ముస్లిం నాయకులు వల్లి, అక్బర్‌బాషా, తదితర మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవు రోజూ తరగతుల నిర్వహణ


విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న మల్లెం హేమంత్‌కుమార్

రైల్వేకోడూరు, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ సెలవు దినంగా ప్రకటించినా రైల్వేకోడూరులో ఓ కార్పొరేట్ స్కూలు తరగతులు నిర్వహిస్తుండగా రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లెం హేమంత్ కుమార్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు దినంగా అధికారులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీన్ని గుర్తించి యాజమాన్యంతో సామరస్యంగా చర్చించి విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు విష్ణు, కృష్ణ, అబ్దుల్లా, హరి, మణి, పవన్, మల్లెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యకు నిరసనగా నేడు వైద్యసేవలు బంద్

రాజంపేట, ఆగస్టు 16 : వైద్యురాలి హత్య కేసులో వెంటనే న్యాయం చేయాలంటూ శనివారం వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు రాజంపేట ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ చలమయ్య, కార్యదర్శి డాక్టర్ శ్రీహరి, కోశాధికారి డాక్టర్ ధనశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించే చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వైద్య సేవలను నిలిపివేస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజా సంఘాలు, అన్ని రాజకీయపక్షాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎస్సీ,ఎస్టీ కేసు బాధితుడికి న్యాయం చేయాలి...


డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు, బాధితులు

రాయచోటి (కలెక్టరేట్) ఆగస్టు 16: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ తదితరులు శుక్రవారం డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆరవీడు గ్రామం చిన్నమాకులపల్లెకు చెందిన నగిరిమడుగు అప్పన్న అనే దళితుడిపై అదే గ్రామానికి చెందిన పూల ఆంజనేయులు, పూల అంజనమ్మ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయంపై బాధితుడు 13 సెప్టెంబర్ 2023 పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రజాసంఘాల ఆందోళనతో పోలీసులు నామ మాత్రపు కేసు పెట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా నియమితుడైన అప్పటి రాయచోటి డీఎస్పీ నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వండాడి రెడ్డి సుధాకర్,కిరణ్, అప్పల, బాధితులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట, ఆగస్టు 16: విద్యుత్తు లైన్ల సమీపంలో ఉన్న చెట్లు తొలగించి మరమ్మతులు చేస్తున్నట్లు డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న బ్రాహ్మణపల్లె, ఎస్ఆర్ పాలెం, ఆకేపాడు, కట్టకిందపల్లె, బావికాడపల్లె ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివే స్తున్నట్లు వివరించారు. ప్రతి నెలా 2వ శనివారం మర మ్మతులు చేయాల్సి ఉండగా ప్రతికూల వాతావరణం వల్ల చేయలేకపోయామన్నారు. ఈ విషయాన్ని వినియో గదారులు గుర్తించి విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

కోడూరు రూరల్ సీఐగా వెంకటేశ్వర్లు

చిట్వేలి, ఆగస్టు 16 : కోడూరు రూరల్ సీఐగా పి.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రాయచోటి ఎస్పీ ఆఫీసులో విధులు నిర్వ హించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సురేంద్ర నాథ్‌రెడ్డి కడపకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు ప్రశాంత జీవనాన్ని గడపాలన్నారు.

ఒంటిమిట్ట ఎస్ఐగా శివప్రసాద్



ఒంటిమిట్ట, ఆగస్టు 16 : మండల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా శివ ప్రసా ద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మధుసూదన్ రావు లింగాల మండలానికి బదిలీ అయ్యారు. ముందుగా కోదండ రాముని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు ఎస్ఐకి బాధ్యత లను అప్పగించారు. వీరికి పోలీసు సిబ్బంది శుభా కాంక్షలు తెలియజేశారు.

రాజంపేట పట్టణ సీఐగా ఎల్లమరాజు



రాజంపేట టౌన్, ఆగస్టు 16 : రాజంపేట పట్టణ సీఐగా ఎల్లమరాజు శుక్రవారం బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మట్కా, జూదం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతు న్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీఐ ఎల్లమరాజుకు పట్టణ పోలీసుస్టేషన్ పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

పెనగలూరు ఎస్ఐగా రవిప్రకాష్‌రెడ్డి



పెనగలూరు, ఆగస్టు 16 : పెనగలూరు మండల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం రవిప్రకాష్‌రెడ్డి బాధ్య తలు స్వీకరించారు. ఈయన గతంలో చిత్తూరు జిల్లా కల్లూరు మండలం ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసాంఘి క కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ముఖ్యంగా మైనర్లు బైకులు నడపడం అరికడతామన్నారు. ముందుగా ఒకసారి హెచ్చరించి వదిలిపెడతామన్నారు. మళ్లీ అలాగే చేస్తే భారీగా జరిమానా విధించడంతోపాటు, కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి విక్రయం ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పూర్తిగా దృష్టి సారించి శాంతిభద్రతలను అదుపులో ఉంచుతామని ఆయన తెలిపారు.

చిట్వేలి ఎస్ఐగా రఘురాం



చిట్వేలి, ఆగస్టు 16: చిట్వేలి ఎస్‌గా కె రఘురాం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పుల్లంపేట ఎస్ఐగా ఉన్న ఆయన ప్రస్తుతం రాయచోటిలో వీఆర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి చిట్వేలి ఎస్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేస్తామని తెలియజేశారు

వడ్డెరల హక్కుల సాధనకు కృషి : మంత్రి మండిపల్లి



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు16: వడ్డెరల హక్కుల సాధనకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ కల్యాణ మండపంలో ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డెరల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. వడ్డెరలు అన్నిరంగాల్లో కూడా వెనుకబడి ఉన్న మాట వాస్తవమేనని, వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తమ కుటుంబం ముందు వరుసలో ఉందని, రాయచోటి మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత వడ్డెర కులానికి దేరంగుల వీరభద్రయ్యను మున్సిపల్ ఛైర్మన్‌నుచేసిన ఘనత తమ కుటుంబానికి దక్కుతుందన్నారు. 90 శాతానికిపైగా వడ్డెరలు తనకు ఓటు వేశారని, తన గెలుపులో భాగస్వాములైనందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. వడ్డెరలకు దక్కాల్సిన క్వారీలు పెత్తందారుల చేతుల్లో ఉండిపోతున్నాయని విద్యావంతుల వేదిక అధ్యక్షుడు, లీగల్ అడ్వైజర్ టీ. ఈశ్వర్ ప్రస్తావించారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల జనాభా ఉండగా 175 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా వడ్డెర కులస్తులు లేకపోవడం బాధ కలిగించే విషయమన్నారు. మనదేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో వడ్డెరలు ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని, ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో వడ్డెరల ప్రాతినిధ్యం అన్ని రంగాల్లో ఉందని విద్యావంతుల వేదిక గౌరవాధ్యక్షుడు దేరంగుల రమణయ్య అన్నారు. మన రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో చేస్తున్న ఉద్యమానికి అండగా నిలవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ వడ్డెరలకు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం ఇవ్వాలని, అప్పుడే వడ్డెర జాతి అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక నాయకుడు కోటేశ్వరరావు వడ్డెరల కోసం చేసిన ఉద్యమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, పెమ్మాడపల్లి సర్పంచ్ వాసు, న్యాయవాది నాగముని, కోటకొండ రవి, వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, జీవానందం, ఉపాధ్యక్షులు చల్లా రెడ్డెయ్య, కుంచపు రెడ్డెయ్య, బండల శీను, విజయనగరం రామకృష్ణ, నూలివీడు నాగేశ్వరరావు, శివప్రసాద్, ఇడగొట్టు నగేశ్వరరావు, దుద్యాల శంకర్, హరినాథ్, దేవరాజ్, ఎల్‌బీసీ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ స్వగృహలో టీచర్ వేణుమాధవ్‌రాజు గృహ ప్రవేశ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు.

అభిమానులకు ప్రత్యేక గుర్తింపు

సంబేపల్లె: తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తాను గెలిస్తే తలనీలాలు సమర్పించుకుంటానని మండలం గుట్టపల్లెకు చెందిన కోట చంద్రబాబునాయుడు మొక్కుకున్నాడని, ఆ మొక్కు తీర్చుకున్నాడన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం నారాయణరెడ్డిపల్లెలోని మంచాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గొట్టిండ్ల రమణయ్య, ఆంజనేయులు, రంగస్వామి, మాజీ సర్పంచ్ భాగ్యమ్మ, స్థానిక నాయకులు, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల నిర్వహణ తీరుపై జేసీ ఆగ్రహం


అధికారులను విచారిస్తున్న జేసీ

వీరబల్లి, ఆగస్టు 16: మండలంలోని వీరబల్లి, పెద్దివీడు, మట్లి గ్రామాల సహకార సంఘ రుణ గ్రహీతల వివరాలు అప్‌డేట్ సక్రమంగా లేక పోవడంతో ఆ కార్యాలయాల సిబ్బందిపై అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరబల్లిలోని ఎంపీడీవో కార్యాలయాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్నీ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుణాలు తీసుకున్న వారి భూముల వివరాలు, సెల్ నెంబర్లు తప్పక ఆన్‌లైన్ చేయాలన్నారు. సహకార సంఘం వారు చేయలేకపోతే సచివాయ సిబ్బందికి సమాచారం ఇచ్చి త్వరితగతిన చేయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డికి సూచించారు. సోమవారం లోపు తప్పక ఆన్‌లైన్ చేయిస్తామని వారు సమాధానం ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఫ్రీ హోల్డ్ సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల ధర పెంచి పాడి రైతులను ఆదుకోవాలి

● సీపీఐ(ఎంఎల్) నేత మావులూరి విశ్వనాథ్

రాయచోటి టౌన్, ఆగస్టు 16: పాల ధర పెంచి పాడి రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో గేదె పాలు లీటరు రూ.70 నుంచి రూ.80 వరకు, ఆవుపాలు లీటరు రూ.35 నుంచి రూ.40 వరకు ఉండేవన్నారు. ప్రస్తుతం పాల ధరలు బాగా తగ్గాయన్నారు. ప్రస్తుతం గేదె పాలకు లీటరుకు రూ.65 నుంచి రూ.75లు, ఆవుపాలు లీటరుకు రూ.25 నుంచి రూ.35లు చెల్లిస్తుండడంతో పాడిరైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి తోడు పశువుల ధరలతో పాటు దాణా, గడ్డి, వైద్యం ఖర్చులు పెరగడంతో పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతులు ఆవుల కొనుగోలుపై లక్షలు పెట్టుబడి పెట్టి గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, గేదె పాలు లీటరుకు రూ.80, ఆవుపాలు లీటరుకు రూ.40 ఉండేలా ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాయచోటి ఏరియా నాయకులు రమణ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డా.. మురుగు గుంతా?

● వర్షపు నీటి నిల్వతో నిత్యం ప్రమాదాలు
● గాయాల పాలవుతున్న ద్విచక్రవాహనదారులు


ప్రధాన రహదారిపై నిలిచిన నీటిలో వెళుతున్న వాహనదారులు

సుండుపల్లె, ఆగస్టు 16: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదురుగా రాయవరం, పింఛా తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి డ్రైనేజీను తలపిస్తోంది. వర్షం పడితే చాలు రోడ్డుపై నీరు నిలచి పోయి ప్రమాదాలకు దారితీస్తోంది. మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా ఈ పరిస్థితి నెలకొందని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు అర్జీలు ఇచ్చినా కూడా సమస్య పరిష్కారం కావడం లేదని వాహనదారులు అంటున్నారు. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ ప్రధాన రహదారిపై తిరుగుతుంటాయి. ఇదే రహదారిలో రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ, పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెళుతుంటారు. వారెవరికీ ఈ సమస్య కనిపించడం లేదా అని స్థానికులు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం అర్ధగంటసేపు వర్షం కురవడంతో ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరడంతో పాఠశాలకు వెళ్లి వస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు కిందపడి గాయాలపాలయ్యారు. అలాగే పింఛా నుంచి రాయచోటికి స్కూటీలో కుటుంబం గురువారం సాయంత్రం ఈ నీటిలో పడిపోవడంతో రక్తపు గాయాలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ప్రమాదాలకు కారణమైన రోడ్డుపై వర్షపు నీరు నిలువ లేకుండా ఉండేలా మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి

కోడూరు, ఆగస్టు 16 : గిరిజనుల భూముల సమస్యలపై ఇప్పటివరకు ఎన్ని రకాలుగా ఉద్యమాలు నిర్వహించినా న్యాయం జరగడంలేదని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి ఆవేదన వ్యక్తం చేశారు. బీకేఎంయూ రైల్వేకోడూరు మండల కార్యదర్శి వినయ్ ఆధ్వర్యంలో గిరిజనుల భూముల సమస్యలపై డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్ల క్రితం బుడుగుంటపల్లె పంచాయతీలో 30 గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున భూమిని కేటాయిసూత్త పట్టాలు ఇచ్చి భూమిని చూపించారు. అయితే, ఇంతవరకు ఆ భూముల వివరాలు ఎందుకు ఆన్‌లైన్ చేయడంలేదని ప్రశ్నించారు. దళిత గిరిజనుల భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేదంటే సెప్టెంబరు 9న సామూహిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సీపీఐ కోడూరు మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిప్పన ప్రసాద్ పాల్గొన్నారు.

19న మండల సమావేశం

సుండుపల్లె, ఆగస్టు 16: ఈ నెల 19వ తేదీన సుండు పల్లె మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎం పీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పాత్రికే యులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ముత్తుమారమ్మ జాతర

నందలూరు, ఆగస్టు 16 : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ముత్తు మారమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీ పూజలు, 18న జాతర, 19న పాలపూజ కార్యక్రమాలు ఉంటాయని, ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



కారు, ద్విచక్ర వాహనం ఢీ

- ఘటనా స్థలంలో తండ్రి, ఆస్పత్రిలో కూతురు మృతి
- చికిత్స పొందుతున్న తల్లి, మరో కుమార్తె

గంగాధరనెల్లూరు, ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రతం రోజున ఆ ఇంట్లో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదం రూపంలో తండ్రీ పెద్ద కుమార్తెను మృత్యువు తీసుకెళ్లిపోయింది. తల్లి, చిన్న కూతురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెకు చెందిన అబ్బాస్ హుస్సేన్ (31), భార్య హసీమా(27), కుమార్తెలు షబ్నం (3), తమ్మీమ్(6 నెలలు) ద్విచక్ర వాహనంపై చిత్తూరు ఆస్పత్రికి చేరుకున్నారు. తమ్మీమ్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూపించారు. తర్వాత చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు మండలంలోని వీరకనెల్లూరులో నిర్వహించే పీర్ల ఊరేగింపులో పాల్గొనేందుకు బయలుదేరారు. నెల్లేపల్లె సమీపంలో వస్తుండగా వారి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అబ్బాస్ హుస్సేన్, హసీమా, షబ్నం, తమ్మీమ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వస్తున్న వాహనదారులు 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేలోపే అబ్బాస్ హుస్సేన్ మృతిచెందాడు. హసీమా, ఇద్దరు కుమార్తెలను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షబ్నం చికిత్స పొందుతూ మృతి చెందింది. హసీమా, తమ్మీమ్ చికిత్స పొందుతున్నారు. గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



పసిడి చీరలో పద్మావతమ్మ

- తిరుచానూరులో ఘనంగా వరలక్ష్మి వ్రతం


స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతి దేవి

తిరుచానూరు, ఆగస్టు 16 : తిరుచానూరులో కొలువైన పద్మావతీ దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కనులపండువగా వరలక్ష్మి వ్రతం జరిగింది.అమ్మవారి ఉత్సవమూర్తిని బంగారు చీరలో ఆస్థాన మండపంలోని పద్మపీఠంపై కొలువుదీర్చారు.సంప్రదాయ పుష్పాలతో ఆరాధించి అమ్మవారిని 9 గ్రంథులతో అలంకరించారు.12రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన వరలక్ష్మి వ్రతం మధ్యాహ్నం 12గంటలకు మహా మంగళహారతితో ముగిసింది. సాయంత్రం మహాలక్ష్మి అలంకరణలో స్వర్ణరథంపై కొలువుదీరిన పద్మావతీ దేవి మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించింది.టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం ఆకట్టుకుంది.20వేల కట్ ఫ్లవర్స్‌తో మూడు రోజుల పాటు 15మంది సిబ్బంది శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు.పద్మావతీ దేవిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.సర్వదర్శనానికి గంటన్నరకుపైగా పట్టింది.ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు,జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కళంకిత కార్పొరేటర్లు అవసరమా?

- టీడీపీలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల తహతహ
- వారంతా భూమన షాడోలంటున్న స్థానిక నాయకులు
- తర్వాత చూస్తామని తిప్పిపంపిన పార్టీ అధిష్ఠానం


మంత్రి రాంప్రసాద రెడ్డితో అన్నా రామచంద్ర, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్లలో అరాచకశక్తులుగా మారి ప్రజలను ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిన కొందరు వైసీపీ కార్పొరేటర్లు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. పార్టీ కండువా కప్పేసుకుంటామని కూటమి నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి తలపడ్డవారి బతుకు మీద కొట్టడమే కాక చేయాల్సిన అరాచకాలన్నీ చేసేసి అవేమీ గుర్తు లేనట్టుగా జంపింగ్‌కు సిద్ధపడుతున్న వారికి కొందరు కూటమి నేతలు రెడ్‌కార్పెట్ పరుస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ అధికారంలో ఉండగా ఎలాంటి పదవీ లేకపోయినా ముఖ్యనేతకు దగ్గరగా మెలిగిన ఓ కీలక నేత టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.అప్పట్లో ఎలాంటి సెటిల్‌మెంటైనా అతడి కార్యాలయంలోనే జరిగేది. తన ఇంటిలో ఓ కార్పొరేటర్ ఉండగా, సమీప బంధువు మరొకరు,అనుచరులైన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు కార్పొరేటర్లను కూటమిలోకి తీసుకొస్తానంటున్న ఆయన డిప్యూటీ మేయర్ పదవి తన కుటుంబానికే ఇవ్వాలని డిమాండు చేస్తున్నట్టు సమాచారం.43వ డివిజన్లో పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థికి చెందిన టీ దుకాణాన్ని అధికార బలంతో ధ్వంసం చేశారు.45వ డివిజన్ పరిధిలో టీ దుకాణం నడుపుతున్న ఓ టీడీపీ కార్యకర్తపై దాడి చేసి గాయపరిచారు. ఎన్నికల ముందు 'జగన్ రెడ్డి మరో 30 ఏళ్లు సీఎంగా ఉంటారు. మా పార్టీలోకి వచ్చేయండి' అని భయపెట్టిన వైసీపీ నేతలు కూడా ఇప్పుడు కూటమిలోకి వచ్చేందుకు పరితపిస్తున్నారు.మూడున్నరేళ్లుగా అధికారబలంతో టిఫిన్ బండి నుంచి కూడా మామూళ్లు వసూలు చేసుకోవడానికి అలవాటు పడ్డ ఇంకొందరు కార్పొరేటర్లు కూడా పార్టీ మారేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.డివిజన్లో ఇల్లు కట్టుకునేందుకు ఎవరైనా ఇటుకలు తోలుకుంటే కూడా డబ్బులు డిమాండు చేసిన కార్పొరేటర్లు ఇప్పుడు కూటమిలోకి రావడం వలన ఎవరికి ప్రయోజనమో పార్టీ అధిష్ఠానాలు బాగా ఆలోచించాల్సివుంది.

మేయర్ రాకపోతే వీరొచ్చినా ఉపయోగంలేదు

50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. అంటే మేయర్ బెర్త్‌ను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరారు. ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. అయితే నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు మేయర్‌పై అవిశ్వాసం పెట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ చట్టాన్ని సవరించింది. దీంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ కాలవ్యవధిని కుదిస్తూ చట్ట సవరణ మళ్లీ చేస్తే తప్ప కొత్త మేయర్ ఎన్నిక జరగదు. నాలుగేళ్లు పూర్తయ్యేందుకు ఇంకా ఆరు నెలల సమయముంది. పార్టీ మారేందుకు సందిగ్ధంలో ఉన్న మేయర్ డాక్టర్ శిరీష వైసీపీలోనే కొనసాగేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. అందువల్ల ఇప్పటికిప్పుడు మెజారిటీ కార్పొరేటర్లు కూటమి వైపు వచ్చినా కూటమి ఖాతాలోకి మేయర్ పీఠం చేరదు.

ఇందుకేనా వచ్చేది?

వైసీపీ స్థానిక నాయకత్వం అనుమతితోనే కొందరు కార్పొరేటర్లు కూటమిలోకి వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలో ఉంటే అన్ని విధాలా ప్రయోజనాలు పొందవచ్చని, ఇక్కడి రహస్యాలను చేరవేసేందుకు కూడా అవకాశం ఉంటుందన్న రాజకీయ కోణంతో వైసీపీ నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పాటు మరో ఏడాదిన్నరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తమ కార్పొరేటర్ సీటును అధికార పార్టీనుంచి హామీ తీసుకుని పోటీ చేయాలని మరికొందరు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు.శ్రీకాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేని వెంటబెట్టుకుని శుక్రవారం ఓ పదిమంది కార్పొరేటర్లు విజయవాడ బాట పట్టారు. పార్టీ కండువాలను కప్పేసుకోవడానికి సిద్ధపడితే, ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశం తరువాత స్థానిక నాయకత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని టీడీపీ ముఖ్యనేతలు తిప్పి పంపినట్టు తెలిసింది.

వీరి గురించి సమాచారమివ్వండి

టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల గురించి ఆరా తీసేందుకు పార్టీ అధిష్ఠానం సిద్ధమైంది. ఆదం సుధాకర రెడ్డి కుమార్తె ఆదం లీల (9వ డివిజన్ కార్పొరేటర్), దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి(10వ డివిజన్), దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి భార్య ప్రవళ్లికా రెడ్డి(11), మహేష్ రెడ్డి భార్య షాలిని రెడ్డి (15), వెంకటముని రెడ్డి తల్లి రాజమ్మ (20), డిష్ చంద్ర భార్య సునీత (22), పొన్నాల చంద్ర (28), దూది శివ భార్య కుమారి (33), మునిరామి రెడ్డి భార్య శ్రావణి (34), కుడితి సుబ్రమణ్యం (36), బాలసుబ్రమణ్యం భార్య గీత (37), నరేంద్ర నాథ్(38), మురళీ యాదవ్ భార్య రాధ (43), పెంచలయ్య భార్య రాణి (46), అనిల్ (50), ఈశ్వరి (21), అనీష్ రాయల్ (45)తో పాటు ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన అన్నా రామచంద్రయ్య కుమార్తెలు అన్నా సంధ్య (48), అన్నా అనిత (49వ డివిజన్ కార్పొరేటర్)ల గురించి పూర్తి సమాచారం కావాలని స్థానిక నాయకత్వాన్ని టీడీపీ కోరినట్లు సమాచారం.

వాళ్లను తీసుకోవద్దు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

ఐదేళ్లుగా తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకోవద్దని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును స్థానిక టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడికి వైసీపీ కార్పొరేటర్ల ఆగడాల గురించి వివరించారు. స్థానిక నాయకత్వానికి ఎలాంటి సమాచారం లేకుండా పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివలన పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లి ఆ పార్టీలో కూడా చేర్చుకోనివ్వకుండా చూడాలని కోరారు. పల్లా శ్రీనివాసరావును కలిసినవారిలో 43వ డివిజన్ ఇంచార్జి ఆర్సీ శ్రీనివాసులు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మునిశేఖర్ రాయల్, బాలసుబ్రమణ్యం రెడ్డి, సుబ్రమణ్యం ఉన్నారు.


టీడీపీలో చేరేందుకు విజయవాడ వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, నేతలు



జయహో

షార్‌లో సంబరాల హోరు


రాకెట్ మొదటి దశ


రెండవ దశ


మూడవ దశ


నాల్గవ దశలో విడిపోతున్న ఉపగ్రహం

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరోసారి మెరిసింది. ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ప్రయోగ విజయంతో మరో చారిత్రాత్మక మైలురాయిని దాటింది. చిన్న ఉపగ్రహ వాహక నౌక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఈవోఎస్-08 ఉపగ్రహంతో పాటు మరో రెండు బుల్లి ఉపగ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలో ప్రవేశపెట్టడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని తిలకిస్తున్న శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇది శాస్త్రవేత్తలు దేశానికి ఇచ్చిన కానుకగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ అభివర్ణించారు.రాకెట్ విజయానికి అహర్నిశలూ పనిచేసిన శాస్త్రవేత్తలను అభినందించారు.

దశల వారీగా రాకెట్ విడిపోయింది ఇలా..

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ అన్ని దశలనూ సునాయాసంగా పూర్తి చేసుకొని 17 నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. 34 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, 119 టన్నుల బరువు గల రాకెట్ తన మొదటి దశలో 87 టన్నుల ఘన ఇంధనంతో భూమి నుంచి నింగిలోకి పయనమై 124 సెకన్లకు 93 కి.మీ ఎత్తులో తొలి దశ పూర్తి చేసుకొంది. 7.7 టన్నుల ఘన ఇంధనంతో 125 సెకన్లకు ప్రారంభమైన రెండో దశ 420 సెకన్లకు 450 కి.మీ ఎత్తులోకి వెళ్లి పూర్తి చేసింది. అనంతరం మూడవదశ ప్రారంభమై 4.5 టన్నుల ఘన ఇంధనంతో వేగంగా 697 సెకన్లకు 475 కిలోమీటర్ల ఎత్తుకు చేరింది. అనంతరం 0.05 టన్నుల ద్రవ ఇంధనంతో నాలుగో దశ ప్రారంభమై రాకెట్‌లో ఉన్న ఈవోఎస్-08 ఉపగ్రహం 808 సెకన్లకు కక్ష్యలోకి విడిపోయింది. అనంతరం 994 సెకన్లకు ఎస్ఆర్-0, డెమోశాట్ ఉపగ్రహాలు కూడా ఒకదాని తరువాత రోదసీలోకి ప్రవేశపెట్టారు. సంవత్సరం పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది.

- సూళ్లూరుపేట


ఎర్రచందనం స్మగ్లర్లు, దుంగలతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

ఏడు దుంగలు, కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, ఆగస్టు 16: భాకరాపేట రేంజ్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి దుంగలు, కారు, మోటారు సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీమ్ గురువారం సాయంత్రం భాకరపేట చేరి, స్థానిక అటవీ అధికారులతో కలసి కోటకాడపల్లి, ఉస్తికాయలపెంట మీదుగా పింఛా వైపు కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయలపెంట ఎస్టీ కాలనీ చేరుకోగా, అక్కడ కొంతమంది కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు గమనించి చుట్టుముట్టారు. పారిపోయే ప్రయత్నం చేయగా వారిలో ఆరుగురిని పట్టుకోగలిగారు. తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన అనుమాన్ (42), సెంజి వేడి (26), చిన్న వేడి (22), మురుగేశన్ (32), ఆయనార్ (23), శివానందం (37)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

నేడు టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 16: వివిధ కారణాలతో రెండుసార్లు వాయిదా పడిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ శనివారం నుంచి కొనసాగనుంది. సర్‌ప్లస్ టీచర్లకు సంబంధించిన జాబితా ఎంఈవోల లాగిన్‌కు వస్తుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంఈవో కార్యాలయంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతుంది. తొలుత స్కూల్ అసిస్టెంట్లు, ఆపై సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీడీలకు నిర్వహిస్తారు. 'మీరు సర్‌ప్లస్ టీచర్‌గా ఉన్నారు' అంటూ సమాచారం వచ్చిన టీచర్లు ఎంఈవో కార్యాలయంలో హాజరై ఏ పాఠశాలలో అడ్జస్ట్‌మెంట్ కావాలో కోరుకోవాల్సి ఉంది.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా జడ్జి ఎ.నారాయణమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాల మేరకు 2014సెప్టెంబరు 26న చిన్నగొట్టిగల్లు మండలం బోడిరెడ్డిగారిపల్లె ఎస్టీకాలనీ వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మిట్టపల్లి ధనంజయరెడ్డి, తుపాకుల రామచంద్ర, తుపాకుల వెంకట్రామయ్యలను భాకరాపేట పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురికి జైలు శిక్ష ఖరారుచేశారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్ వాదించారు. కేసు నిరూపణకు కృషి చేసిన దర్యాప్తు అధికారి ఎన్.కంటయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారిపాదాల వద్ద వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమల నారాయణగిరి శ్రీవారిపాదాల వద్ద శుక్రవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఈసందర్భంగా శ్రీవారిపాదాల వద్ద టీటీడీ అర్చకబృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు. తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పూజాసామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల గుండా అర్చక బృందం మేదరమిట్టకు చేరుకుంది. అక్కడి నుంచి వాహనంలో శ్రీవారిపాదాల వద్దకు చేరుకున్నారు. ముందుగా శ్రీవారిపాదాలకు తిరుమంజనం చేపట్టారు. ఈసందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. తర్వాత భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకుల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

సర్వదర్శనానికి 16 గంటలు


అలిపిరిలో భారీగా నిలిచి ఉన్న వాహనాలు

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. కాలినడక మార్గాలతోపాటు ఘాట్‌రోడ్లు, అలిపిరి చెక్ పాయింట్ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో శుక్రవారం సాయంత్రం సమయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లతోపాటు నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతం, లడ్డూ వితరణ కేంద్రం, కొబ్బరికాయలు సమర్పించే అఖిలాండం, అన్నప్రసాద భవనం వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. ఇక, గదులకు డిమాండ్ పెరిగింది. ఒక గది పొందేందుకు దాదాపు 2 నుంచి 3 గంటల సమయం పడుతోంది. అలాగే తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

నారాయణీ నమోస్తుతే

● వరాలతల్లి వరలక్ష్మికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ● మహిళా భక్తుల వ్రత వేడుకలతో కిటకిటలాడిన ఆలయాలు


వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే మిట్స్ కాలేజీ కరస్పాండెంట్


వాల్మీకిపురంలో పూజలందుకుంటున్న వరలక్ష్మీదేవి


కలికిరి యల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16: వరాలిచ్చే వరాలతల్లి వరలక్ష్మికి శ్రావణ రెండో శుక్రవారం ప్రతి ఇంట భక్తిప్రపత్తులతో వ్రతాలు, విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు అమ్మవారికి ఆహ్వానం పలికి బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ముత్తైదువులకు వాయనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. చిప్పిలి గ్రామంలోని మడియక్కల శివాలయంలోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలతో వరలక్ష్మీదేవి వ్రతం ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో మహహిళలు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక రెడ్డెప్ప నాయుడు కాలనీలో అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతోపాటు కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త మార్పూరి సుధాకర్‌నాయుడు, నాదేళ్ల ద్వారకనాథ్, నాదేళ్ల విద్యాసాగర్, బీజేపీ జాతీయనేత చల్లపల్లె నరసింహారెడ్డి, డాక్టర్ అజంతుల్లాఖాన్, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, కనకంటి సుధాకర్‌రెడ్డి, మార్పూరి నాగార్జున బాబు(గాంధీ), సహదేవ నాయుడు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిగా కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శ్రావణ మాసం రెండో శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి కోర్టులో గంగమ్మను వరలక్ష్మీదేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి పూజలో పాల్గొని చీర, జాకెట్లు, పసుపు,కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి అమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు,ట్రెజరర్లు రాటకొండ రంగస్వామి నాయుడు. కరుణాకర్ నాయుడు మార్పూరి మహేష్, మార్పూరి విక్కీ, జోలెపాళెం దేవేంద్ర,బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాంఢ్ల కృష్ణకుమారి పర్యవేక్షించారు.

పీలేరులో: పీలేరు మండలంలోని తెలుగింటి ఆడపడుచులు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం పీలేరులోని కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, రౌద్రాల అంకాళమ్మ ఆలయం, ప్రకాశం రోడ్డు, సదుం రోడ్డులలోని రామాలయాలు, అగ్రహారంలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి ఆలయం, కోటపల్లెలోని ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళల చేత వరలక్ష్మి వ్రతాన్ని ఆచరింపజేశారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం మండలంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శుక్రవారం వ్రత వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంటా మహిళలు అమ్మవారి ప్రతిమలను తీర్చి వరలక్ష్మి వ్రతం జరిపి పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి పూజలు చేశారు.

గుర్రంకొండలో:వరలక్ష్మీ వ్రతం వేడుకలను మండల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఇళ్లలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను చేయించారు. అలాగే చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో వరలక్ష్మీ వత్ర పూజలను ప్రత్యేకంగా చేయించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే అరిగెలవారిపల్లె, తరిగొండ గ్రామాల్లో అక్కదేవతలకు పచ్చ వేయించి పూజలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులకు పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కలకడలో:శ్రావణ మాసం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ సిద్దేశ్వర ఆలయం, వేణుగోపాల్‌స్వామి ఆలయం తదితర గ్రామాలలోని ఆలయాలలో ప్రత్యేక పూజలను చేశారు. మహిళలు వారి వారి ఇంటిలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వ్రత పూజలను నిర్వహించారు. ఎర్రకోటపల్లె, కలకడ సిద్దేశ్వరస్వామి ఆలయంలో నాగురాళ్ల వద్ద భక్తులు నాగు రాళ్లకు పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. పిండి వంటలను ప్రసాదాలుగా ఉంచారు.

కురబలకోటలో: కురబలకోట మండలంలో వరలక్ష్మి వ్రత వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని మహిళలు తమ ఇళ్లలో లక్ష్మీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మదనపల్లె పట్టణంలోని రెడ్డెప్ప నాయుడు కాలనీలో వరలక్ష్మి వ్రత వేడుకలను నిర్వహించారు.

ములకలచెరువులో: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ములకలచెరువులోని సనత్‌కుమార్ ఇంట్లో జరిగిన వరలక్ష్మీ పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు ఇళ్లల్లో లక్ష్మీదేవి ప్రతిమను కొలువుదీర్చి పూలు, చీర, గాజులు, నగదు, ఆభరణాలతో విశేషంగా అలంకరించి లక్ష్మీదేవికి పూజలు చేశారు. రకరకాల పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దమండ్యంలో: మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, పాపేపల్లి, వెలిగల్లు, బండమీదపల్లి, తురకపల్లి, శివపురం, సిద్దవరం, నగిరి, బండ్రేవు తదితర గ్రామాలల్లో శుక్రవారం భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. అమ్మావారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కలికిరిలో: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం సందర్భంగా స్థానిక గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కష్టపడిన వారికే టీడీపీ గుర్తింపు ఇస్తుంది

● జిల్లా అధ్యక్షుడు చమర్తి చమర్తి జగన్‌మోహన్‌రాజు


టీడీపీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, ఆగస్టు 16:టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్ల కాలంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించి కష్టపడిన వారికే ప్రస్తుత ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు ఇచ్చి గుర్తిస్తుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రాజును కలిశారు. తాము ఐదేళ్లుగా అష్టకష్టాలు పడ్డామని, తమపై అక్రమ కేసులు బనాయించారని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ఐదేళ్లుగా కార్యకర్తలు నిర్వహించిన కార్యక్రమాల వివరాలు అధిష్టానం వద్ద ఉన్నాయని, వాటి ఆధారంగానే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నామినేటెడ్ పదవులను అధిష్టానం ఇస్తుందన్నారు. ఏ కార్యకర్త, నాయకుడు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ నిర్దిష్ట ప్రణాళికతో అందరికి న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, దొరస్వామి నాయుడు, దేవరింటి శ్రీనివాసులు, టీఎస్‌టీయూసీ కొండ్రెడ్డి, దేవారమేశ్, ఆర్‌జే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటలపాటు ఓపీ సేవలు బంద్

పీలేరు, ఆగస్టు 16: కలకత్తాలోని వైద్యులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా పీలేరులో 24 గంటలపాటు ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. కలకత్తాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఈ నెల 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయంతోపాటు ఆ ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులపై ఈ నెల 14వ తేదీ రాత్రి రౌడీమూకల దాడులను నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వివరించారు. ఓపీ సేవలు శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపివేస్తున్నామని, ప్రజలు తమ ఆవేదనను అర్థం చేసుకుని సహకరించాలన్నారు. అత్యవసర కేసులకు హాజరవుతామని వారు స్పష్టం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ తాము ఓపీ సేవల బంద్ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

కలికిరి పంచాయతీ తాత్కాలిక సర్పంచుగా యల్లయ్య

● ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం


యల్లయ్యను అభినందిస్తున్న టీడీపీ నాయకుడు యోగేష్‌కుమార్

కలికిరి, ఆగస్టు 16: కలికిరి మేజర్ పంచాయతీ తాత్కాలిక సర్పంచుగా ఆర్. యల్లయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులిచ్చారు. టీడీపీకి చెందిన కలికిరి పంచాయతీ సర్పంచుగా ఉన్న రెడ్డివారి ప్రతాప్‌కుమార్ రెడ్డి మే 17న అనారోగ్యంతో మృతి చెందారు. అనంతర పరిణామాల్లో ఉప సర్పంచుగా ఉన్న నూరున్నీసా జూన్ 8న వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసి వార్డు సభ్యురాలుగా మాత్రమే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో జూలై 11న జరిగిన అత్యవసర సమావేశంలో 14వ వార్డు సభ్యుడు ఆర్. యల్లయ్యను తాత్కాలిక సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ మేరకు యల్లయ్యను తాత్కాలిక సర్పంచుగా నియమించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సానుకూలంగా ఆమోదిస్తూ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టరు తాజా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇక నుంచి కలికిరి పంచాయతీ సర్పంచుగా యల్లయ్య కొనసాగనున్నారు. నియామకం పొందిన యల్లయ్యను పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, టీడీపీ నాయకుడు యోగేష్‌కుమార్ రెడ్డి అభినందించారు.

హార్స్‌లీహిల్స్‌లో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

బి.కొత్తకోట, ఆగస్టు16: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌కు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కుటుంబ సమేతంగా విచ్చేశారు. గురువారం రాయచోటిలో ఆగస్టు15 వేడుకల అనంతరం రాత్రికి ఆయన కుటుంబంతో కలిసి హార్స్‌లీహిల్స్‌కు చేరుకొని పోలీస్ అతిథిగృహంలో బసచేశారు. ఉదయం కుటుంబంతో కలిసి హిల్స్ మీదనున్న చూడదగ్గ ప్రదేశాలైన గాలిబండ, కొత్తఏరియల్ వ్యూపాయింట్, అటవీశాఖ సముదాయం, మానసస రోవరం తదితర వాటిని తిలకించారు. కొండపైన పొగమంచుతో కూడిన చల్లటిగాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూసి ఉల్లాసంగా గడిపారు. హిల్స్ అందాలకు, వాతావరణానికి ముగ్ధులయ్యారు. బి. కొత్తకోట పోలీసులు ఎస్పీకి విడిది ఏర్పాట్లు చేశారు.

డ్రిప్ పైపు దొంగల భరతం పట్టిన పోలీసులు


●ఇద్దరు దొంగల అరెస్టు..రిమాండ్‌కు తరలింపు


స్వాధీనం చేసుకున్న డ్రిప్ పైపులు, వాహనంతో సీఐ మధు, ఎస్ఐ గాయత్రి

ములకలచెరువు, ఆగస్టు 16: రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న డ్రిప్ పైపు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. రూ.3లక్షలు విలువ చేసే డ్రిప్ పైపులు స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేసన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ మధు, ఎస్ఐ గాయత్రి వివరాలను వెల్లడించారు. ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఇటీవల రైతులు పొలాల వద్ద ఉన్న డ్రిప్ పైపుల దొంగతనం జరిగింది దీనిపై రైతుల నుంచి పలు ఫిర్యాదులు కూడా అందాయి. ఈ క్రమంలో ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో ఎస్ఐ గాయత్రి, సిబ్బంది సాంబ, చిరంజీవి వాహనాల తనిఖీ చేస్తుండగా ముందస్తు సమాచారం మేరకు భారీగా డ్రిప్ పైపులు తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా రైతుల పొలాల వద్ద నుంచి డ్రిప్ పైపులు దొంగతం చేసుకుని వాహనంలో తీసుకెళ్తున్న మదనపల్లె పట్టణం లక్ష్మీనగర్‌కు చెందిన ఆవుల రాజు(30), గాలివీడుకు చెందిన ఆవుల తిరుపాల్(21)లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 54 కట్టల డ్రిప్ పైపులు స్వాధీనం చేసుకుని డ్రిప్ పైపులు తీసుకెళ్తున్న వాహనాన్ని సీజ్ చేశారు.

రైతు బోరుపై ప్రత్యర్థుల దాడి

● బోరు పైపులు కోసివేత ● లబోదిబోమన్న రైతన్న


ప్రత్యర్థులు కోసివేసిన బోరును చూపిస్తున్న రైతు వెంకటరత్న

నిమ్మనపల్లి, ఆగస్టు 16: వ్యవసాయ రైతు బోరుపై వైసీపీ సానుభూతి పరుడు దాడి చేసి ఎవ్వరూ లేని సమయంలో బోరు పైపులను కత్తిరించిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లికి చెందిన వెంకటరత్న అనే రైతుకు సంబంధించిన సర్వే నెంబరు-1164లో గల బోరు బావికి ఏర్పరిచిన పైపులను అదే గ్రామానికి చెందిన గంటా సరస్వతమ్మ, వైసీపీ సానుభూతి పరుడు గంటా మునికుమార్‌లు మరో వ్యక్తితో కలసి బోరు వద్దకు వెళ్లి పైపును కత్తించాడని ఆరోపించాడు. దీంతో బోరుబావిలో అమర్చిన మోటారు బావిలో పడిపోయిందని అదే సమయంలో బోరు కింద గడ్డి నాటుకొన్న రైతు మల్లికార్జున వారిని గమనించి వారించగా వారు అక్కడ నుంచి పరారయ్యారని తెలిపాడు. కాగా గత వైసీపీ ప్రభుత్వంలో తనను వేధించడమే కాకుండా తన భూమిని అక్రమంగా లాక్కున్నారని శుక్రవారం మరలా వ్యవసాయ భూమిలో ఉన్న బోరుపైపును కత్తిరించాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తనకు దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. అనంతరం అతను స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరాడు.

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

● జ్వర లక్షణాలతో వచ్చే వారికి నిర్ధారణ పరీక్షలు చేయాలి ● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కొండయ్య


తంబళ్లపల్లెలో జ్వర బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో కొండయ్య


దోమల నివారణ మందు పిచికారి చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

తంబళ్లపల్లె, ఆగస్టు 16: దోమల వలన వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కొండయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కోసువారిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య, రోజువారీ ఓపీ, ఇన్‌పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల గది, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ), పీఎంవీవై పథకాలు, ఎన్‌సీడీ సర్వే, ఇమ్యునైజేషన్ టీకాల గురించి ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం పొందేలా చైతన్యం కల్పించి, ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లల ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలని వారి వివరాలను ఆర్‌సీహెచ్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో దోమల వలన వ్యాప్తి చెందే జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తంబళ్లపల్లె సీహెచ్‌సీని సందర్శించి సీజనల్ వ్యాధులు, జ్వరాలపై వైద్యాధికారి వెంకట్రామయ్యతో చర్చించారు. అనంతరం తంబళ్లపల్లెలో ఇటీవల డెంగ్యూ బారిన పడిన బాధితుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలని బాధితులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునికుమార్, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎం కుతీజా, కవిత, ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దోమల నివారణ చర్యలు

తంబళ్లపల్లె, ఆగస్టు 16: తంబళ్లపల్లె మం డల కేంద్రంలో ఇటీవల మూడు డెంగ్యూ కేసులు నమోదవ్వడంతో అధికారులు దోమల లార్వాల నివారణకు ప్రత్యేక చర్య లు చేపడుతున్నారు. ఇప్పటికే దోమల నివారణకు మొదటి విడత రాత్రి పూట ఫాగింగ్ చేయడంతో పాటు ఇంటింటి ఫీవర్ సర్వే, యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహించారు. శుక్రవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రెండో దపా మురుగు నీటి కాలువలు, నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణం, జ్వర బాధితుల ఇళ్ల వద్ద పైర త్రం ద్రావణం పిచికారి చేశారు.

ఫ్రైడే-డ్రైడే, ఇంటింటి ఫీవర్ సర్వేతో పాటు యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమరావతి, హెల్త్‌అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎం కుతీజా, కవిత, భారతి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూములపై సమగ్ర విచారణ

●అర్హులైన రైతులెవ్వరికీ అన్యాయం జరగనివ్వం ● మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వెల్లడి


బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట, ఆగస్టు16: గత ప్రభుత్వహయాంలో ఫ్రీహోల్డ్ ఇచ్చిన డీకేటీ, అసైన్డ్ భూములన్నింటిపై సమగ్రంగా, కూలంకషంగా రీవెరిఫికేషన్ చేయిస్తున్నామని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. దీనివల్ల అర్హులైన రైతులెవ్వరికీ అన్యాయం జరగదని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్, కులం సర్టిఫికెట్ దరఖాస్తులను పెద్దసంఖ్యలో ఆన్‌లైన్‌లో రిజెక్ట్ చేయడంపై సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలను ఒక్కొక్కరుగా పిలిచి ఆయా గ్రామ ఫ్రీహోల్డ్ భూముల వివరాలు, రీవెరిఫికేషన్ స్టేటస్, కులం సర్టిఫికెట్ల తిరస్కరణపై ఆరా తీశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 42వేల ఎకరాలకు పైగా ఫ్రీహోల్డ్ ఇచ్చారని, వాటిపై రీవెరిఫికేషన్ 45శాతం పూర్తయిందన్నారు. ఇప్పటిదాకా 22వేల పైచిలుకు ఎకరాలను పరిశీలించగా 8వేల ఎకరాలను వివిధ కారణాల వల్ల ఫ్రీహోల్డ్‌ను రద్దు పరచడం జరిగిందన్నారు. 2003 తర్వాత పట్టాలు పొంది, భూములను అన్యాక్రాంతం చేసివున్నా, అక్రమంగా రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్‌లు చేసిఉన్నా అటువంటి భూములకు సంబంధించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రీహోల్డ్ అయిన భూములకు సంబంధించి రైతుల వద్ద పాతపట్టాలు లేకపోయినా తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న 10వన్, ఏ రిజిస్టర్ మేరకు వారి అర్హతను గుర్తించి న్యాయం చేయాలని మండల రెవెన్యూ సిబ్బందిని ఆదేశిస్తామన్నారు. ఫ్రీహోల్డ్ అయిన భూములలో సుమారు 1500 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయని అవసరమైతే వాటిపై కూడా విచారణ చేస్తామన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దహనంతో హార్స్‌లీహిల్స్ భూములకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని, అన్ని మండలాలలో జరుగుతున్న ఫైళ్ల రికవరీ లాగానే హిల్స్ రికార్డులు సిద్ధం అవుతాయని స్పష్టం చేశారు. తానే ఛైర్మన్ అయిన హార్స్‌లీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాలు త్వరలో నిర్వహించి హిల్స్ అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీధర్‌రావు, డీటీ మహ్మద్ అన్సారీ, ఆర్ఐ బాలాజీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల విగ్రహప్రతిష్ఠ


అక్కదేవతల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్థులు

కురబలకోట, ఆగస్టు 16: కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ బద్దిపల్లి గ్రామ సమీపంలో ఘనంగా అక్కదేవతల విగ్రహాలను శుక్రవారం వైభవంగా ప్రతిష్ఠించారు. కాగా ఈ అక్కదేవతలను చుట్టుపక్కల గ్రామాలైన ఆర్సీకురవపల్లె, బద్దిపల్లె. చిగురేవాండ్లపల్లె గ్రామ ప్రజలు ఆరాధ్యదైవంగా కొలుస్తారు. పెద్దసంఖ్యలో ప్రజలు మంగళవాయిద్యాల నడుమ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ విగ్రహాలను సాంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తల్లీకూతురు అదృశ్యం

రామసముద్రం, ఆగస్టు 16: రామసముద్రం మండలం ఊలపాడు గ్రామస్థుడు బి.బాబాజాన్ భార్య నౌషాద్, కూతురు షాపియా కనిపించలేదని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. భార్య నౌషాద్ కుమార్తె షాఫియాతో పాటు ఇద్దరిని గురువారం రామసముద్రంలో వి.కోటకు వెళ్లే బస్సు ఎక్కించి పంపానని కానీ వారు ఎక్కడికి వెళ్లారో ఆచూకి లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మండల మాలమహానాడు అధ్యక్షుడిగా కృష్ణప్ప

రామసముద్రం, ఆగస్టు 16: మండల మాలమహానాడు అధ్యక్షుడుగా మట్లవారిపల్లెకు చెందిన టి.కృష్ణప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా నారాయణస్వామి, ఉపాధ్యక్షులుగా కె.వెంకటేష్, రమణప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శివ, సహాయ కార్యదర్శులుగా కె.నరసింహులు, డి.శీనప్ప, ప్రచార కార్యదర్శిగా టి.కృష్ణప్ప, కోశాధికారిగా జి.చంద్రప్పను ఎన్నుకున్నారు. వీరితో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పీలేరు సర్పంచుగా తిరిగి హబీబ్ బాషా!


వార్డుసభ్యులతో కలిసి ఎంపీడీవోకు లేఖ అందజేస్తున్న సర్పంచ్ హబీబ్ బాషా

పీలేరు, ఆగస్టు 16: పీలేరు సర్పంచ్‌గా తిరిగి డాక్టర్ హబీబ్ బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వంలో కుదిరిన ఒప్పందం మేరకు పీలేరు సర్పంచు పదవిని ఇద్దరు నాయకులకు చెరి రెండున్నరేళ్ల మేరకు పంపకాలు చేసిన వైసీపీ నాయకులు ఎందుకనో మనస్సు మార్చుకున్నారు. ఒప్పందాన్ని రద్దు చేసి గతంలో సర్పంచుగా ఉన్న వారికే మళ్లీ పదవి కట్టబెట్టారు. దీంతో సెలవులో ఉన్న పీలేరు సర్పంచు డాక్టర్ హబీబ్ బాషా ఉన్నపళంగా తన సెలవు రద్దు చేసుకుని హుటాహుటిన అధికారులను కలిసి తాను బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలుపడమే కాకుండా శుక్రవారం మధ్యాహ్నానికల్లా పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇంత కాలం ఇన్‌ఛార్జ్ సర్పంచుగా బాధ్యతలు నిర్వహించిన ఉప సర్పంచు జీనత్ షఫీ పాలన ముగిసింది. తమకు మాత్రంగానైనా చెప్పకుండా ఏకపక్షంగా సర్పంచు మార్పు నిర్ణయం తీసుకున్నారంటూ జీనత్ షఫీ కుటుంబం వైసీపీ అధినాయకత్వంపై కినుకు వహించింది. తమను అవమానించారంటూ సోషియల్ మీడియాలో పోస్టు పెట్టుకుని ఆవేదన వ్యక్తపరిచింది. దీంతో పీలేరు సర్పంచు వ్యవహారం మరోమారు వార్తల్లో నిలిచింది.

చెరువులో అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు


పత్తేపురం చెరువులో మట్టి తవ్వకాలపై స్థానికులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

వాల్మీకిపురం, ఆగస్టు 16: వాల్మీకిపురం మండలంలోని పత్తేపురం గ్రామం తల్లాంగారి చెరువులో గత కొద్దికాలంగా హిటాచీలు, టిప్పర్ల ద్వారా అక్రమంగా జరుపుతున్న మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయం శుక్రవారం పత్తేపురం గ్రామస్థులు స్థానిక తహసీల్దార్ పామిలేటికి ఫిర్యాదు చేశారు. చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని చెప్పడంతో స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బంది ద్వారా చెరువు వద్దకు చేరుకుని అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. చెరువులో ఉన్న టిప్పర్లు, హిటాచి యంత్రాలను హెచ్చరించి పంపించేసేశారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరైనా సరే ఇసుక, మట్టి తవ్వకాలు, అక్రమ రవాణాకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వీఆర్వో సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.50 వేల విరాళం


అన్నక్యాంటీన్ కోసం ఎమ్మెల్యేకు రూ.50 వేల చెక్కును ఇస్తున్న శ్రీనివాసాచారి దంపతులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 16 : మదనపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన వెంటనే స్థానిక విష్ణు జ్యువెల్లర్స్ యజమాని జి.శ్రీనివాసాచారి, జి. కళావతి, వారి కుమారుడు అనిల్‌విష్ణు కలసి రూ.50 వేలు చెక్కును విరాళంగా అందించారు. సీఎం చంద్రబాబు పిలుపుమేరకు స్పందించిన వీరు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతికి ఈ చెక్కును అందజేశారు. వీరి దాతృత్వాన్ని ఎమ్మెల్యే అభినందించారు. పది మందికి స్ఫూర్తిగా నిలిచారని కితాబు ఇచ్చారు.

బి.కొత్తకోట తహసీల్దార్‌గా శ్రీధర్‌రావు



బి.కొత్తకోట, ఆగస్టు16: బి.కొత్తకోట తహసీల్దార్ గా నియమితులైన శ్రీధర్‌రావు శుక్రవారం విధుల్లో చేరారు. డిప్యూటీ తహశీల్దార్ మహ్మద్‌అన్సారీ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికారు. కడప జిల్లా కమలాపురంకు చెందిన శ్రీధర్‌రావు రాజంపేట నియోజకవర్గంలో పనిచేస్తూ బదిలీపై బి.కొత్తకోటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండల రెవెన్యూ స్థితిగతులపై అధ్యయనం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నగర పంచాయతీ కావడంతో పాటు, ఈ మండల పరిధిలోనే ప్రముఖ పర్యాటక కేంద్రం హర్స్‌లీహిల్స్ వున్నందున విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తామన్నారు.